సాక్షి గుంటూరు

12

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో ప్రభుత్వం తాగునీటిని అందించకపోవడంతో వరద నీటిలోనే ముంపునకు గురయిన బోరు నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళ

వరద నీటిలో సురక్షిత ప్రాంతానికి ట్రాక్టర్‌లో తరలిపోతున్న కొల్లూరు మండలం ఆవులవారి పాలెం ప్రజలు





తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహా మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్‌తో నాటు పడవలో వరద బాధిత గ్రామం బొమ్మువానిపాలెం వెళ్లారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు.



తుళ్లూరు మండల ఉద్దండరాయునిపాలెం నుంచి 250 మందిని పోలీసులు పడవల్లో పునరావాస కేంద్రానికి తరలించారు.



కనకదుర్గ వారధి నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో కొలనుకొండ గుంటూరు చానల్ వద్ద మంగళవారం భారీగా ఆహార పొట్లాలు పడేసి ఉన్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యుల తీరును ప్రజలు విమర్శించారు.



మహానాడులో వర్షపు నీటిని బయటకు తోడుతున్న ఓ మహిళ



తాడికొండలో వరద ఉధృతితో ధ్వంసమైన రోడ్డు

తీరని వేదన!

- లంక గ్రామాలకు తొలగని ముప్పు
- కొండవీటి వాగుకు వరద ఉధృతి
- పలుచోట్ల ప్రధాన రహదారులు ధ్వంసం
- వేల ఎకరాల్లో పంట మునకతో రైతులు కుదేలు
- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

భారీ వర్షాలకు తోడు కృష్ణమ్మ వరద ఉప్పొంగడంతో లంక గ్రామాలు మంగళవారం నాటికీ తేరుకోలేదు. జిల్లావ్యాప్తంగా పలు చోట్ల నీట మునిగిన తీర గ్రామాలలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వరదలో నానుతున్న పంటను చూసి అన్నదాతలు కుదేలయ్యారు. ఇళ్లలోకి చేరిన నీరు తొలగించే పనిలో ప్రజలు ఉండగా.. పొలాల్లో చేరిన వరద బయటకు పోయే మార్గం కనిపించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం తమవైపు కన్నెత్తి చూడటం లేదని అనేకమంది వాపోతున్నారు. తీర వాసుల ఆవేదనను ఆలకించే నాథుడు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. - నెట్‌వర్క్



మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో నివాసాలకు వెళ్లే మార్గంలో ప్రవహిస్తున్న వరద నీరు

తాడికొండ: భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలు ఇంకా తగ్గుముఖం పట్టకపోవడంతో ముంపు ప్రాంతాల వారు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటు కొండవీటి వాగు, ఇటు కృష్ణా నదికి వరద పోటెత్తడంతో వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. లంక గ్రామాలు పూర్తిగా నీటిలోనే ఉండటంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుతున్నారు. కొండవీటి వాగు ఉధృతి కారణంగా తాడికొండ- కంతేరు మధ్య ఉప్పొంగిన ప్రవాహానికి ఎర్రవాగు వద్ద గండి ఏర్పడింది. రోడ్డు పూర్తిగా కోతకు గురై 4 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. పొన్నెకల్లు- దామరపల్లి మధ్య గుర్రం వారి వాగుకు వచ్చిన వరద కారణంగా రోడ్డు పూర్తిగా కోసుకుపోయింది. ఇక్కడా రాకపోకలు లేవు. గుర్రంవారి చెరువు పూర్తిగా ఆక్రమణలకు గురికావడంతోపాటు టీడీపీ నాయకులు ఇక్కడ అక్రమంగా కళ్యాణ మండపం నిర్మాణం కోసం చదును చేయడంతో వాగు ప్రవాహం ముందుకెళ్లే పరిస్థితి లేక రోడ్డు కోతకు గురైంది. లంక గ్రామాలైన హరిశ్చంద్రపురం, పెదలంక, తాళ్ళాయపాలెం గ్రామాల్లో ఇప్పుడిప్పుడే కొద్దిగా వరద ఉధృతి తగ్గుతోంది. పునరావాస కేంద్రాల నుంచి స్థానికులు ఇళ్లకు చేరుతున్నారు. నివాసాలను శుభ్రం చేసుకుంటున్నారు. గత 20 సంవత్సరాల్లో చూడని విధంగా వచ్చిన వరద కారణంగా ముందస్తుగా ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ఇళ్లలో సామగ్రి వదిలి బయటకు రావాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండవీటి వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం కారణంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. తాడికొండ, తుళ్ళూరు, మంగళగిరి రూరల్ మండలాల్లో వేల ఎకరాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టానికి పరిహారం కోసం పరిశీలించాల్సిన అధికారులుగానీ, పరామర్శించాల్సిన ప్రజా ప్రతినిధులుగానీ ఇటుగా రాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలాలు శ్రమించి పండించిన పంట నీటిలో కళ్ల ముందే మునిగిపోతే ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదా? అని మండిపడుతున్నారు. ఇకనైనా స్పందించాలని కోరారు.

ఆహారం పంపిణీ

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈవో రామకోటిరెడ్డి ఈ ప్రాంతంలోని వరద బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. తమ్మా వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, అక్షయ పాత్ర సంస్థ, మరికొంత మంది సహకారం అందించారు. వారితో కలిసి టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మరి కొంతమంది నాయకులు ఆహార పొట్లాలను మహానాడు ప్రాంతంలో పంపిణీ చేశారు.

రైతులకు కోలుకోలేని దెబ్బ

కొల్లిపర: కృష్ణా నది వరద ఉధృతితో లంక గ్రామ ప్రజలతోపాటు కరకట్ట దిగువన ఉన్న వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు పంటలకు మాత్రమే నష్టం జరిగేదని, ఈ సారి ఇళ్లు కూడా దెబ్బతిన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగి ఉండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లిపర మండలంలో లంక గ్రామాలు, కరకట్ట దిగువన రైతులు 1,424 ఎకరాలలో ఉద్యాన పంటలైన పసుపు, అరటి, కూరగాయలు సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడిప్పుడే మొక్కలు, చెట్లు కాస్త బయటికి కనిపిస్తున్నాయి.

మహానాడును వదలని బురద

తాడేపల్లి రూరల్: కృష్ణానది శాంతించడంతో మంగళవారం మహానాడు ప్రాంతంలో వరద తగ్గింది. వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్న స్థానికులు ఒక్కొక్కరుగా ఇంటికి చేరుకుంటున్నారు. చాలా ఇళ్లలోని గదులు, పరిసరాలు పూర్తిగా బురదమయం అయ్యాయి. ఇళ్లకు వచ్చి శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. విద్యుత్ మోటార్లు పనిచేయకపోవడంతో కార్పొరేషన్ నీళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఆ నీరు కూడా కొద్దికొద్దిగా రావడంతో ఇబ్బందులు తప్పడం లేదని మహిళలు వాపోయారు. మహానాడులో కొన్ని నివాసాలు రోడ్డు కన్నా దిగువన ఉండడంతో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు కుటుంబ సభ్యులందరూ శ్రమిస్తున్నారు. ఒక్కో ఇంట్లో నుంచి బురద 10 నుండి 15 బకెట్లు వరకు వస్తోందని స్థానికులు తెలిపారు. రోడ్డుపైనా కాలు పెట్టలేని పరిస్థితి ఉందని, ఏ మాత్రం అడుగు తడబడినా జారి కింద పడిపోతున్నామని పేర్కొన్నారు. పలువురు సమీపంలోని వరద నీటిని బక్కెట్లలో మోసుకొచ్చి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. వరద వల్ల పురుగులు కూడా వస్తున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మహానాడు ప్రాంతంలో మొత్తం 15 ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. వాటిని పరిశీలించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనిలో అధికారులు ఉన్నారు.



పొన్నూరు ప్రధాన వీధిలో నిలిచిన నీరు



కొల్లిపర వద్ద కృష్ణా వరద తగ్గటంతో కరకట్ట లోపల అరటి తోటలో పైకి కనిపిస్తున్న మొక్కలు

న్యూస్‌రీల్

నేడు తెరుచుకోనున్న పాఠశాలలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో భారీ వర్షాల కారణంగా మూతపడిన పాఠశాలలు బుధవారం తెరుచుకోనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాల్సి ఉండగా, విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ప్రకటించారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విధులకు హాజరైన ఉపాధ్యాయులు వర్షాల కారణంగా ఎక్కడైనా గోడలు దెబ్బతినడం, ఇతర ఇబ్బందులు తదితరాలను పరిశీలించాలని సూచించారు. మరుసటి రోజు తరగతుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన అధికారులు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామంలో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను మంగళవారం స్పెషల్ సీఎస్పీ రాజశేఖర్, అగ్రికల్చర్ కమిషనర్ ఢిల్లీరావు, గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తదితరులు పరిశీలించారు. కృష్ణా వరద కారణంగా నీట మునిగిన లంక పొలాలకు సంబంధించి పూర్తిస్థాయి పంట నష్టంగా పరిగణిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఏడీఏ, శాస్త్రవేత్తలు పాలడుగు సత్యనారాయణ, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా తర్వాతే పరిహారం



మంగళగిరి: పంట నష్టాన్ని అంచనా వేసిన తర్వాత రైతులకు త్వరలోనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హార్టికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా రామచంద్రాపురంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు డీడీహెచ్ బి.రవీంద్ర బాబు, సైంటిస్ట్ డాక్టర్ సి.వి. రామన్ తదితరులు పాల్గొన్నారు.



తుళ్ళూరు పెదలంక నుంచి ఇబ్రహీంపట్నం పునరావాస కేంద్రానికి బాధితుల తరలింపు



కొల్లిపర పరిధి పాత బొమ్ము వానిపాలెంలో కృష్ణా వరదను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్



వరద ప్రభావంతో తెనాలి రూరల్ మండలంలో నీట మునిగిన పంట పొలాలను రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట నష్టంపై ఏడీఏ ఎన్. ఉషారాణి ఆయనకు వివరించారు. - తెనాలి

వరద బాధితులపైనా కూటమి నేతల జులుం



పునరావాస కేంద్రం నుంచి వెళ్లిపోతున్న పాతబొమ్మువానిపాలెం వాసులు

తూములూరు(కొల్లిపర): పునరావాస కేంద్రానికి తరలించిన వరద బాధితులకు భోజనం పెట్టడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. వేళకు ఆహారం ఇవ్వలేకపోవటంపై కొందరు ఇదేమని అడగడమే పాపమైంది. కూటమి నేతలు వారిపై జులుం ప్రదర్శించారు. కొల్లిపర మండలం పరిధిలోని తూములూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో వరద బాధితుల కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రం ఏర్పాటు చేసింది. అక్కడ 250 మంది ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు భోజనం తీసుకొచ్చారు. తీరా చూస్తే అందులో అన్నం, పెరుగు మాత్రమే ఉన్నాయి. దీనితో పాత బొమ్మువానిపాలెం గ్రామానికి బాధితులు.. ఈ రోజు కూరలు లేవా? అని అడగటమే నేరమైంది. అదే గ్రామానికి చెందిన కూటమి పార్టీ నాయకుడు స్పందిస్తూ.. రోజూ ఇంటి వద్ద నాలుగు కూరలు వేసుకుని తింటున్నారా? అంటూ అవహేళన చేశారు. తూములూరు గ్రామంలోని కూటమి పార్టీకి చెందిన మరో నాయకుడు కలగజేసుకుని పునరావాస కేంద్రంలో మీకు వైట్ రైస్, పెరుగు ఇవ్వటమే ఎక్కువ... తింటే తినండి లేకపోతే వెళ్లిపోండి.. అంటూ దురుసుగా మాట్లాడాడు. దీంతో కొద్ది నిమిషాలపాటు వాగ్వివాదం నెలకొంది. నొచ్చుకున్న 70 మంది బాధితులు వరద చుట్టుముట్టిన తమ గ్రామానికి వెళ్లిపోయారు.

రేపు జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కార్యక్రమం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం చెప్పారు. 14 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. వారు గురువారం మ. 2 గంటలకు ఎస్ఆర్ శంకరన్ హాలుకు చేరుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పురస్కారానికి ఎంపికైన ఉపాధ్యాయులు..

- షేక్ షఫీవుల్లా, స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లిషు (జెడ్పీ హైస్కూల్, కొర్నెపాడు)
- పొగతోట సునీతా రజని, స్కూల్ అసిస్టెంట్, గణితం (శ్రీశారదానికేతనం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు)
- అబ్దుల్ షాజీర్, స్కూల్ అసిస్టెంట్, సోషల్ స్టడీస్ (ఎంపీయూపీఎస్, ఉర్దూ, నులకపేట)
- ఆచన కోటేశ్వరరావు, స్కూల్ అసిస్టెంట్, గణితం (జెడ్పీ హైస్కూల్, మందడం)
- బి. రమేష్‌బాబు, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (జెడ్పీ హైస్కూల్, పెనుమాక)
- డి.నాగ కృష్ణకుమారి, స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లిషు (జెడ్పీ బాలుర హైస్కూల్, దుగ్గిరాల)
- షాహిద్ అలీ షేక్, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్ (ఎంపీయూపీఎస్, ఉర్దూ, నులకపేట)
- షేక్ అనీలా సుల్తానా, స్కూల్ అసిస్టెంట్, హిందీ (జెడ్పీ హైస్కూల్, నిడమర్రు, మంగళగిరి)
- జొన్నలగడ్డ జోసఫ్ సుధీర్‌బాబు, స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లిషు (జెడ్పీ హైస్కూల్, చినకొండ్రుపాడు)
- అరిగ పద్మ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (జెడ్పీ బాలికల హైస్కూల్, దుగ్గిరాల)
- కసుకుర్తి భాస్కరరావు, ఎస్జీటీ (ఎంపీపీఎస్, చింతలపూడి, పొన్నూరు)
- తలాటం సుబ్బారావు, ఎస్జీటీ (ఎంపీపీఎస్, బీసీ, పేరేచర్ల)
- వల్లు శ్రీరామప్రసాద్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం (ఎంపీపీఎస్, కాకుమాను)
- షెహనాజ్ బేగం, ఎస్జీటీ – ఉర్దూ (నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, సంగడిగుంట, గుంటూరు).